కథ

# దీపావళి

ద్వారకానగరంలో శ్రీకృష్ణుడి ఎదురుగా దేవతలూ, ఋషులూ నిలబడి ''కృష్ణా శరణు, శరణు. కరుణించి కాపాడు'' అన్నారు.


''మునీంద్రులారా, దేవతలారా, మీరాకకు కారణం''

''జగత్ప్రభూ, నీకు తెలియని సంగతులేముంటాయి? ప్రాగ్జ్యోజితష పురాన్ని పరిపాలించే నరకాసురుడు మా అమరావతిపై దండెత్తి వచ్చి, ఇంద్రుణ్ణి ఓడించాడు. దేవేంద్రుడు నగరాన్ని విడిచి పారిపోయాడు. నరకాసురుడు దేవతల సంపదతోపాటు దేవమాత అదితి కర్ణకుండలాలు కూడా అపహరించాడు. విషయాలు విన్నవించడానికై మమ్మల్ని ఇంద్రుడు మీ దగ్గరకు పంపించాడు'' అని దేవతలు చెప్పారు.

''దేవాధిదేవా, నరకాసురుడు మాయజ్ఞాలలో అర్పించే హవిస్సులో భాగాన్ని కోరుతున్నాడు. హవిర్భాగం ఇవ్వని కారణంగా మమ్మల్ని హింసిస్తున్నాడు'' అని ఋషులు చెప్పారు.

''మీరెవరూ భయపడకండి. నేను వెంటనే వెళ్ళి నరకాసురుణ్ణి సంహరిస్తాను'' అన్నాడు శ్రీకృష్ణుడు.

వచ్చిన వారందరూ శ్రీకృష్ణుడికి నమస్కరించి వెళ్ళిపోయారు. రణరంగానికి వెళ్ళడానికి కృష్ణుడు గరుడవాహనాన్ని అధిరోహించే సమయంలో సత్యభామ భర్త దగ్గరగా వెళ్ళి ''ప్రభూ, మీరు శత్రుసంహారం చేస్తున్నప్పుడు చూడాలని నా కోరిక. దయచేసి నన్ను మీతో తీసుకువెళ్ళండి. యుద్ధరంగం నుంచి తిరిగి వచ్చిన తరువాత మీ వీరప్రతాపాలను నేను మీ దేవేరులందరికీ వర్ణించి చెప్తాను'' అంది.



శ్రీకృష్ణుడి పెదవులపై దరహాసం కదలాడింది. ''నేను వెళ్ళేచోట తుమ్మెదల ఝుంకారాలూ, పువ్వుల సువాసనలూ, చల్లటిగాలి తెమ్మెరలూ, తామరకొలనులూ ఉండవు. నేను యుద్ధానికి వెడుతున్నాను. ఏనుగుల ఘీంకారాలూ, గుర్రాల సకిలింపులూ, బాణాల వర్షాలూ, సైనికుల అరుపులూ ఉండే రణరంగానికి నీవంటి సుకుమారి వచ్చి తట్టుకోలేదు. త్వరలోనే వస్తాను. నీవు కోరిన వస్తువులు తెస్తాను. నువ్వు రావద్దు.''

సత్యభామ శ్రీకృష్ణుడి దగ్గరగా వెళ్ళి ''రాక్షసుల వల్ల నాకు భయమేమిటి? మీ బాహువులే కోటగా కట్టి నన్ను కాపాడుతారని నాకు తెలుసు. నన్ను మీతో రానివ్వండి'' అని భర్తకు నమస్కరించింది. ఆమె వినయానికి ముగ్ధుడైన శ్రీకృష్ణుడు ఆమెను తనతో తీసుకువెళ్ళాడు.

★★★

గరుడవాహనం ప్రాగ్జ్యోతిషపురాన్ని సమీపించింది.

''సత్యా, అదిగో నరకాసురుడి రాజధానిని చూడు. చాలా రక్షణ కలిగిన కోట. కొండల మధ్య కట్టిన నగరమిది. బాణాలతోను, నీళ్ళతోనూ, అగ్నితోనూ కోట చుట్టూ రక్షణ ఏర్పరిచాడు. నరకుడి సోదరుడు మురుడు నగరాన్ని కాపలా కాస్తూ ఉంటాడు.'' అన్న భర్తవైపు చిరునవ్వుతో చూసింది సత్యభామ.

శ్రీకృష్ణుడు వరుసగా రక్షణను ఛేదించుకుంటూ కోట ద్వారాన్ని చేరుకున్నాడు. మురాసురుడు శ్రీకృష్ణుడి చేతిలో మరణించాడు. తండ్రి మరణవార్త విని యుద్ధం చెయ్యడానికి వచ్చిన అతని కొడుకులూ చనిపోయారు. చివరకు నరకుడే స్వయంగా సేనను నడుపుకుంటూ వచ్చాడు.

యుద్ధం చెయ్యడానికి వచ్చిన నరకాసురుణ్ణి చూడగానే సత్యభామలో యుద్ధావేశం చెలరేగింది. ఆమె జుట్టును ముడిచి కొప్పు పెట్టుకుంది. చీరకొంగును నడుం చుట్టూ చుట్టి ముందు వైపున దోపుకుంది. ఆమె శరీరంపై నగలూ, పెదవులపై దరహాసమూ మెరుస్తుండగా లేచి ప్రాణేశ్వరుడి పక్కన నిలబడింది.

శత్రుసంహారం చెయ్యాలని ఉత్సాహపడుతున్న ప్రియురాలిని చూసిన శ్రీకృష్ణుడు ''ప్రియా, ఈ రాక్షసులను నేను జయించలేనా? నువ్వెందుకు లేచి నిలబడ్డావు? యుద్ధసంరంభం వదులుకో'' అన్నాడు.

సత్యభామ కదలకుండా నిలబడింది.

''యుద్ధం చెయ్యాలన్న కోరికను వదులుకోవా? సరే. నీ ముచ్చటను నేనెందుకు కాదనాలి. ఇదిగో విల్లుని అందుకో''

భర్త చేతిలో నుంచి విల్లు అందుకుని వింటి తాడుని బిగించింది సత్యభామ. ఆమె వింటినారిని మోగించింది. శత్రుస్త్రీలు ఆశ్చర్యంతోనూ, ఆందోళనతోనూ, అసూయతోనూ సతమతమయ్యారు.


శ్రీకృష్ణుడు భార్యవంక ఆశ్చర్యంగా చూస్తున్నాడు. ఎన్ని సంవత్సరాలు కలిసి కాపురం చేసినా దంపతులిద్దరిలోనూ ఒకరికి తెలియని విషయం మరొకరి దగ్గర మిగిలిపోతుంది కాబోలు. సత్యభామలో కొత్తకోణం కృష్ణుణ్ణి ఆశ్చర్యాంబుధిలో ముంచెత్తుతోంది. ఈమెలో ఇంత వీరత్వముందా? ఎప్పుడు బాణం తీస్తున్నదో, ఎప్పుడు బాణాన్నివిల్లులో సంధిస్తున్నదో, ఎప్పుడు గురి చూసి వదుల్తున్నదో కూడా తెలియడం లేదే.

ఎంతో భయపడుతున్నట్లుగా ఉండే ఈమెలో ఇంత ధైర్యముందా? బంగారు ఊయెల

ఊగడానికే భయపడేది, గరుడవాహనమెలా ఎక్కిందో, చెలికత్తెల కబుర్లనే సహించలేనిది, రణంలో ధ్వనులు విని ఎలా ఓర్చుకుంటున్నదో. నెమళ్ళకి ఆటలు నేర్పలేనిది ఆలీఢపాదంతో ఇంతసేపు ఎలా నిలబడి ఉందో, వీణ వాయిస్తూ అలిసిపోయేది విల్లు పట్టుకుని యుద్ధమెలా చేస్తున్నదో. ఈమెలో పువ్వులకన్నా ఎక్కువైన మృదుత్వమేకాదు, వజ్రాలకన్నా ఎక్కువైన కాఠిన్యం కూడా ఉందన్నమాట. ఈమె బంగారు తామరపువ్వు, అందుకే మృదుత్వమూ, ధృఢత్వమూ ఉన్నాయి.

శ్రీకృష్ణుడి మనస్సు ఆనంద, ఆశ్చర్యాలతో నిండిపోయింది.

నరకుడు సత్యభామవైపు ఆశ్చర్యంగా చూస్తున్నాడు. ఒక ఆడది ఇంత గొప్పగా యుద్ధం చెయ్యగలదా? వరుసగా బాణాలను వదుల్తున్నది. కానీ ఈమెలో ఎక్కడా అలసట కన్పించడం లేదే. తనవైపు రోషంగా చూస్తూ



బాణాలు వేసిన మనిషి భర్తను చూడగానే చిరునవ్వులు చిందించగలుగుతోందే. ఈమె సింహగర్జనానికి బెదిరే సైనికులందరూ పారిపోతున్నారే. ఇక ఈమె బాణాల ధాటికి ఎవరు నిలబడగలరు.

నరకుడి మనస్సులో భయమూ, ఆశ్చర్యమూ కలిసి మెదిలాయి.

వరుసగా బాణాలు వేస్తున్న సత్యభామ చీరకొంగు విడివడి గాలిలో కదలాడింది. రెప రెపలాడుతున్న ఆమె పైట శ్రీకృష్ణుడికి మన్మథుడి జెండాలా అగుపించింది. నరకాసురుడికి తన జీవితాకాశంలో తోకచుక్క పొడిచినట్లుగా అనిపించింది.

''ఈమెతో యుద్ధం చెయ్యడం కన్నా శ్రీకృష్ణుడితో యుద్ధం మెరుగు'' అనుకున్నాడు నరకుడు. ఈమెను ఓడించడం తన వల్ల కాదు. యుద్ధం మాన్పించడం ఎలా?

నరకుడి కుటిలమైన మనస్సులో కుయుక్తి ప్రవేశించింది. అతను వెంటనే శ్రీకృష్ణుడితో మాట్లాడాడు.

''కృష్ణా, ఒక ఆడది మగవాళ్ళ ముందర పౌరుషం చూపిస్తూ, యుద్ధం చేస్తుంటే చూస్తూ కూచున్నావు. నువ్వు మగవాడివేనా? మా రాక్షసులు స్త్రీలతో యుద్ధం చెయ్యరు. మగవారికే మగవారిమైన మాకు మగువలతో యుద్ధం చెయ్యడం అవమానం''

నరకాసురుడిపై బాణం ఎక్కుపెట్టిన సత్యభామ చేతిలో విల్లు కదలకుండా ఉండిపోయింది. ఆమె బాణం వదలలేకపోయింది. ఆమె అవమానాగ్నిలో రగిలిపోయింది.

శ్రీకృష్ణుడు చిరునవ్వుతో ఆమెను దగ్గరకు తీసుకున్నాడు. ''దేవీ చూడు. నీ ప్రతాపానికి ఎదురు నిలవలేక నరకాసుర సైన్యమంతా పారిపోయింది. ఈ యుద్ధంలో విజయం నీదే. నీ వీరత్వానికి తగిన బహుమతి ఇవ్వడం అసాధ్యం. ఈ హారాన్ని స్వీకరించు'' అంటూ తన మెడలో నుంచి హారాన్ని తీసి ప్రేయసి మెడలో వేశాడు.

సత్యభామ మనస్సు కలతతేరింది.

శ్రీకృష్ణుడు చక్రాయుధంతో నరకాసురుణ్ణి చంపివేశాడు.

★★★

ప్రాగ్జ్యోతిషపురంలో ఉత్సవం జరిగింది.

నరకాసురుడి కుమారుడైన భగదత్తుని రాజుగా అభిషేకించాడు శ్రీకృష్ణుడు.మునులూ, దేవతలూ శ్రీకృష్ణుణ్ణి కీర్తించారు.

''మహామునులారా, దుష్టసంహారం జరిగింది. ఇక దేవమాత అదితికి ఆమె కర్ణ కుండలాలను అందజేస్తే నా కర్తవ్యం పూర్తయినట్లే''

''దేవా, ఇంకొక కార్యం తమకై వేచి ఉంది''

''ఏమది''

''నరకాసురుడు ఇదివరలో యుద్ధాలు చేసి, రాజులని గెల్చినప్పుడు రాజకన్యకలను తీసుకువచ్చి ఇక్కడ చెరలో బంధించాడు. వారిని విడిపించి, తాము కరుణించాలి''

సత్యభామ ముఖం కోపంతో కందిపోయింది. ''అబలలైన ఆడవారిని బంధించడమా''

''దేవీ, స్త్రీలు నీవలె సబలలైనప్పుడు ఇటువంటి అకృత్యాలు జరుగవు కదా''

★★★

చెరనుండి విడిపించబడిన రాజకన్యలు శ్రీకృష్ణుడి అందచందాలకూ, గుణగణాలకూ, వీరప్రతాపాలకూ ముగ్ధులయ్యారు. వాళ్ళందరి మనస్సులూ అతని వశమైపోయాయి.

''ప్రభూ, నీ భార్యగా నన్ను స్వీకరించు'' అని అందరూ ఒకేసారి పలికారు.

''సత్యా, ఏమంటావు'' అన్నాడు శ్రీకృష్ణుడు.

''కోరి వచ్చిన కాంతను కాదనరాదు. అందరినీ స్వీకరించి అనుగ్రహించండి'' అంది సత్యభామ.

''నీకు సవతి పోరు..'' భర్త మాటలకు మధ్యలోనే అడ్డువచ్చి ఆమె

''ప్రాణేశ్వరా, మీ హృదయం అమృతభాండం. ఎందరికైనా మీరు ప్రేమామృతాన్ని పంచగలరు. మీరు కాదంటే ఈ రాజకన్యల జీవితాలు ఏం కావాలి? శత్రురాజు చెరలో ఉండిపోయిన వారికి వేరే దిక్కు ఎవ్వరు'' అంది.

''సత్యా, నీ ఉదార హృదయానికి జోహారులు. రణవిద్యా పారంగతురాలవయి కూడా యుద్ధానికి బయల్దేరే ముందు ఎంత వినయంగా ప్రసంగించావు. యుద్ధంలో ఎంతగా శౌర్యప్రతాపాలు ప్రదర్శించావు. నామీద ప్రేమవల్ల ఆగిపోయావుకానీ నీవే నరకాసురుణ్ణి చంపి ఉండేదానివి''

## పాలంకి సత్య

''ప్రభూ, నన్ను అతిగా పొగుడుతున్నారు. భర్త కష్టసుఖాలలో సగపాలు పంచుకోడం భార్య ధర్మం''

''భర్తకి సంబంధించిన ప్రతి విషయంలోనూ భార్యది సగపాలా?''

''తప్పకుండా''

''అయితే విను. నీ తండ్రి సత్రాజిత్తు నేను శమంతకమణిని అపహరించానని నీలాపనిందవేశాడు. నేను అతి ప్రయత్నం మీద ఆ నీలాపనిందను బాపుకున్నాను. నీవు కూడా నావలె నీలాపనిందలు అనుభవించగలవా?''

''అవశ్యం''

''వీరవనితవయి వినయవతివి. పదహారువేల సవతులను ఒకేసారి సాదరంగా ఆహ్వానించిన సౌజన్యవతివి. అయినప్పటికీ భవిష్యత్తులో నిన్ను సవతులతో కలహించే గయ్యాళిగా, భర్తను తూలనాడే గర్విష్టిగా, పొగరుమోతుగా చిత్రీకరిస్తారు''

''ధన్యురాలిని'' అంటూ సత్యభామ భర్తకు నమస్కరించింది.

శ్రీకృష్ణుడు ప్రేమానురాగాలతో ఆమెను దగ్గరగా తీసుకున్నాడు. ఆయన కన్నులలోని కాంతులు దీపావళులుగా లోకమంతా నిండిపోయాయి.

**నరకుడి మనస్సులో భయమూ, ఆశ్చర్యమూ కలిసి మెదిలాయి.వరుసగా బాణాలు వేస్తున్న సత్యభామ చీరకొంగు విడివడి గాలిలో కదలాడింది. రెప రెపలాడుతున్న ఆమె పైట శ్రీకృష్ణుడికి మన్మథుడి జెండాలా అగుపించింది. నరకాసురుడికి తన జీవితాకాశంలో తోకచుక్క పొడిచినట్లుగా అనిపించింది.**

(సత్యభామ జగన్నాటక సూత్రధారికి ప్రియమైన ఇల్లాలు. ''ఒరేయి రారా ఆశీర్వదిస్తాను'' వంటి అప్రాచ్యపు మాటలు ఆమె నోట పలికించిన సినిమా ఈమధ్య చూశాక మనస్సు ఆవేదనతో నిండిపోయింది. పోతనామాత్యులు భాగవతంలో చిత్రీకరించిన సత్యభామను పాఠకులకు పరిచయం చేసే చిన్న ప్రయత్నమే ఈ కథ.)

★